ఈనాడు
THE HEART AND SOUL OF ANDHRA PRADESH
Saturday, March 28, 2009.



# గాలిబుడగ... ఢాం!

# భారత ఆర్థిక మహాపతనం

ఎన్. విజయ్‌కుమార్

భారత్‌ను మిగతా ప్రపంచం నుంచి విడదీసి చూడలేం. భారత ప్రభుత్వానికి తప్ప మరెవరికీ అలాంటి ఆలోచనలురావు. ప్రపంచాన్ని పట్టి కుదుపుతున్న మాంద్యం భారత ఆర్థిక వ్యవస్థపైనా పెనుప్రభావం చూపింది. దిగుమతులు దిగనాసిల్లాయి. ఎగుమతులూ దిగజారాయి. ప్రతి ద్రవ్యోల్బణం ప్రమాదఘంటికలు మోగిస్తోంది. వాణిజ్యం, పెట్టుబడుల రంగంలో ప్రతికూల పవనాలు వీస్తున్నాయి. విదేశమారక ద్రవ్యనిల్వలు వేగంగా కరిగిపోతున్నాయి. స్టాక్‌మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. లక్షలమంది ఉద్యోగాలు డి రోడ్డున పడుతున్నారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ సారథ్యంలోని యు.పి.ఎ. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకొనకుండా మౌనప్రేక్షక పాత్ర పోషించింది.

## ప్రమాదంలో భారత్

భారత బడ్జెట్‌లోటు ప్రమాదకర స్థాయికి చేరుకొంది. స్థూల జాతీయ ఉత్పత్తి (జి.డి.పి.)లో 11శాతాన్ని తాకే అవకాశం ఉంది. ఈ ఏడాది ప్రభుత్వం లక్ష్యించిన దానికన్నా అది రెండింతలు. ఆర్థిక సంక్షోభం మెల్లగా భారత ఆర్థిక వ్యవస్థను కబళించేలా ఉంది. ఈ ప్రక్రియ తక్షణ, దీర్ఘకాలిక అవకాశాలను దెబ్బతీస్తుంది. సామాజిక భద్రత ఛత్రం లేకపోవడంతో దేశంలో ఉద్యోగాలు కోల్పోయేవారి సంఖ్య భారీగా పెరుగుతుంది. దేశంలో పారిశ్రామిక ఉత్పత్తి 16ఏళ్లలో ఎన్నడూలేనంత తక్కువస్థాయికి పడిపోయింది. పన్నుల్లో కోత, వడ్డీరేట్ల తగ్గింపువంటి చిన్నచిన్న చర్యలు ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజితం చేయడంలో విఫలమయ్యాయని దీన్నిబట్టి స్పష్టమవుతోంది. లక్షా20వేలకోట్ల డాలర్ల భారత ఆర్థిక వ్యవస్థ నిరుడు డిసెంబరు 31తో ముగిసిన మూడు నెలల్లో 5.3శాతం మాత్రమే వృద్ధి చెందింది. 2003 చివరి త్రైమాసికం తరవాత అది ఇంతగా బలహీనపడిన సందర్భం లేనేలేదు. కర్మాగారాలు, వస్తు-సేవల రంగం, గనుల్లో ఉత్పాదకత నిరుటితో పోలిస్తే- ఈ ఏడాది జనవరిలో 0.5శాతం పడిపోయిందని కేంద్ర గణాంక సంస్థ తెలిపింది. ఆర్థికమాంద్యం కారణంగా ఎగుమతులు తగ్గిపోయాయి. ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయం నిరుటితో పోలిస్తే మొన్న జనవరిలో 16శాతం, ఫిబ్రవరిలో 13శాతం పడిపోయింది. ఎగుమతుల్లో వార్షికవృద్ధి 20శాతానికిపైగా నమోదు కాగలదని భారత ఆర్థిక అభివృద్ధి వ్యూహపత్రంలో అంచనా వేశారు. ఈ ఏడాది 20,000కోట్ల డాలర్ల ఎగుమతి లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. 2007నాటి ఎగుమతుల విలువలో ఆరోవంతుకన్నా అది తక్కువే. ఈ లక్ష్యాన్ని సాధించే సూచనలూ లేవు. ఎగుమతులు తగ్గిపోవడంతో దేశంలోని కర్మాగారాల్లో ఉత్పత్తి పడిపోయింది. మొత్తం ఉత్పత్తిలో 80శాతం వాటా తయారీ రంగానిదే. ఈ రంగంలో ఉత్పత్తి డిసెంబరులో ఒక శాతం, మొన్న జనవరిలో 0.8శాతం తగ్గిపోయింది. గనుల రంగంలో డిసెంబరులో 1.8శాతం వృద్ధినమోదు కాగా, జనవరిలో ఉత్పత్తి 0.4శాతం తగ్గిపోయింది. మౌలిక వస్తువుల

ఉత్పత్తి ఒకశాతం పడిపోయింది. ఎగుమతులు తగ్గిపోయిన ఫలితంగా దేశంలో ఉద్యోగాలు కోల్పోయినవారి సంఖ్య కోటికి చేరుకోనున్నదని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య తెలియజేసింది. ఒక్క జౌళిరంగంలోని ఎగుమతిదార్లే ఇప్పటికే పది లక్షలమందిని ఉద్యోగాల్లోంచి తొలగించారు. ఎగుమతి ఆధార పరిశ్రమలకు చెందిన అయిదు లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారని, వచ్చే ఆరునెలల్లో ఇదే రంగంలో మరో 15లక్షల ఉద్యోగాలు పోయే ప్రమాదం ఉందని వాణిజ్యమంత్రి కమల్ నాథ్ హెచ్చరించారు. ఇవన్నీ అధికారిక లెక్కలే. బడా కంపెనీలూ ఉద్యోగులను పెద్దసంఖ్యలో తొలగిస్తున్నాయి. ఫలితంగా వినియోగదారు వ్యయాలూ తగ్గిపోతున్నాయి.

ముంచుకొస్తున్న మరో ముప్పు- ప్రతిద్రవ్యోల్బణం. తమ ఆర్థిక వ్యవస్థ ప్రతిద్రవ్యోల్బణ పరిస్థితుల్లోకి దిగజారిందని చైనా ఇప్పటికే అధికారికంగా ప్రకటించింది. భారత్ ఇప్పుడు అదే దారిలో పయనిస్తోంది. కొన్ని నెలలుగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం హఠాత్తుగా తగ్గి, ప్రతి ద్రవ్యోల్బణం దిశగా సాగిపోవడం ప్రజలకు విస్మయం కలిగిస్తోంది. ఈ పరిణామాలతో ఆర్థిక వ్యవస్థకు కొత్త సమస్యలు ఎదురవుతాయి. వృద్ధిరేటు మరింత తగ్గుతుంది. ధరలు ఇంకా పడిపోవచ్చునన్న ఆశాభావంతో వినియోగదార్లు కొనుగోళ్లు వాయిదా వేస్తారు. సెక్యూరిటీల్లో పెట్టుబడిగా పెడితే డబ్బు విలువ మరింత తగ్గవచ్చునన్న భయంతో ప్రజలు డబ్బు దాచిపెట్టుకోవడానికే ప్రాధాన్యం ఇస్తారు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి స్తంభించిపోతుంది. బ్యాంకులు వడ్డీరేట్లు భారీగా తగ్గించడానికి ఈ పరిస్థితి దారి తీస్తుంది.




ఆర్థిక మాంద్యానికి తోడు వ్యవసాయరంగంపై ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం పరిస్థితిని మరింత దిగజార్చింది. దేశంలో సగానికిపైగా జనాభాకు జీవనాధారం వ్యవసాయమే. ఇంతటి కీలకరంగం ప్రయోజనాలను ప్రభుత్వం విస్మరించింది. మద్దతుధరల విషయం పట్టించుకోలేదు. ఎరువులు తదితర ఉత్పాదకాల సబ్సిడీల విషయంలో దాదాపు మొండి చెయ్యి చూపింది. ఇలాంటి కారణాలు వ్యవసాయాన్ని వెనక్కిలాగుతున్నాయి. 2009 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో వ్యవసాయరంగం 2.2శాతం తిరోగమించింది. ఖరీఫ్‌లో నాట్లు 2.4శాతం తగ్గడం వల్ల ఈ పరిస్థితి. దీని పర్యవ

సానంగా ఈ ఏడాది ఆహార ధాన్యాల ఉత్పత్తి 1.3శాతం తగ్గి 22.79కోట్ల టన్నులకు పరిమితం కాగలదన్నది వ్యవసాయ మంత్రిత్వశాఖ అంచనా. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని 23కోట్ల (దేశ జనాభాలో అయిదోవంతు) మందికి తగిన స్థాయిలో ఆహారం, పోషకాహారం లభించడంలేదని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యు.ఎఫ్.పి) తన నివేదికలో తెలిపింది. దేశం మొత్తం మీద 35కోట్ల మంది ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. అంటే వారికి అవసరమైన పౌష్టికాహారంలో 80శాతంకన్నా తక్కువే లభిస్తోంది. నిరుద్యోగం, అనారోగ్యం కారణంగా కోట్లాది భారతీయులు దారిద్ర్యముఖంలోకి జారుకొనే ప్రమాదం ఉంది.

ఎంతో ముఖ్యమైన సూక్ష్మ ఆర్థిక వ్యవస్థపైనా ఆర్థిక మాంద్యం నేరుగా తీవ్ర దుష్ప్రభావం చూపుతోంది. కొన్నేళ్లుగా పోగుబడుతున్న విదేశ మారకద్రవ్య నిల్వలు కరిగిపోతున్నాయి. నిరుడు మే నాటికి విదేశ మారక ద్రవ్యం నిల్వలు గరిష్ఠ స్థాయిలో 32,600కోట్ల డాలర్లుగా ఉన్నాయి. ఈ మార్చి మొదటివారంనాటికి అవి 25,000కోట్ల డాలర్ల స్థాయికి తగ్గిపోయాయి. అమెరికా తదితర అభివృద్ధి చెందిన దేశాల్లోని మార్కెట్లలో నెలకొన్న అస్తవ్యస్థ పరిస్థితులే ఇందుకు కారణం. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ డబ్బును ఉపసంహరించుకోవడంతో మారకద్రవ్యం కరిగిపోయింది. ప్రపంచ ఆర్థిక సంక్షోభం వల్ల తలెత్తిన ద్రవ్య అసమానతల కారణంగా గత నాలుగు నెలల్లో స్థూల జాతీయ ఉత్పత్తి (జి.డి.పి.)లో 3.5శాతం మేరకు విదేశ మారక ద్రవ్యాన్ని భారత్ కోల్పోయింది. బ్రిక్ దేశాల్లో రష్యా తరవాత ఇంతగా నష్టపోయిన దేశం భారతే. (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలను కలిపి బ్రిక్ దేశాలు అంటారు. 2050నాటికి ఇవి ప్రపంచంలోని అత్యంత ధనిక ఆర్థిక వ్యవస్థలుగా రూపొందగలవని అంచనా) విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణకూ రూపాయి విలువ హఠాత్తుగా పతనం కావడానికీ ప్రత్యక్ష సంబంధం ఉంది. మార్చి నెలారంభంలోనైతే అది డాలరుకు 51 రూపాయల స్థాయినీ దాటిపోయింది. ఈ పతనం మున్ముందు కొనసాగవచ్చు. మరోవైపు భారతీయ స్టాక్ మార్కెట్లు ఈ ఏడాది 14శాతం పతనమయ్యాయి. 2008లో 52శాతం మేరకు నష్టపోయాయి. 2008లో రూ.53,000కోట్ల మేరకు, 2009 మార్చి నాటికి రూ.9,217కోట్ల మేరకు విదేశీ సంస్థాగత పెట్టుబడులు వాపసు వెళ్లాయి. భారతీయ స్టాక్ మార్కెట్లను ముందుకు ఉరికిస్తున్నది ఈ పెట్టుబడులే. 2008 ఆరంభం నాటికి దేశంలో విదేశీ సంస్థాగత పెట్టుబడుల మొత్తం 6,650కోట్ల డాలర్లు. దీన్నిబట్టి ఈ పెట్టుబడులు ఎంత ముఖ్యమైనవో అర్థం చేసుకోవచ్చు. ఇంత కీలకమైన విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణతో స్టాక్ మార్కెట్ కుదేలైంది. సమాచార సాంకేతిక (ఐ.టి.) రంగం గాలి బుడగలా పేలిపోవడం దేశ ఆర్థిక వ్యవస్థను మరింత కుంగదీసింది. టి.సి.ఎస్.సహా అనేక భారతీయ కంప్యూటర్ సర్వీసు కంపెనీలు తీవ్ర ఆర్థిక ఒడుదొడుకులను ఎదుర్కొంటున్నాయని 'మోర్గాన్ స్టాన్లీ' పేర్కొంది. ఆదాయం తగ్గిపోవడంతో అవి ఖర్చుల్లో కోత విధిస్తున్నాయి. ఉద్యోగులను పెద్దసంఖ్యలో తొలగిస్తున్నాయి. ఇతర సంస్థల్లో విలీనమవుతున్నాయి. కొన్ని దివాలా తీసి బిచాణా ఎత్తేస్తున్నాయి. టాటా, హెక్సావేర్, టెక్ మహీంద్రా వంటి బడా కంపెనీలకూ తిప్పలు తప్పడంలేదు. ఏప్రిల్ ఒకటితో ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరంలో ఐ.టి. కంపెనీలు 20శాతం మేరకు ఆదాయాలు నష్టపోవచ్చునని అంచనా. రానున్న కాలంలో భారతీయ ఐ.టి. రంగం గిరాకీ ఇంకా తగ్గిపోయే ప్రమాదమూ ఉంది.

ఆర్థిక వ్యవస్థ ఇంత తీవ్రస్థాయి మాంద్యాన్ని, బహుముఖీన సమస్యలను ఎదుర్కొంటున్నప్పుడు ప్రభుత్వం తీసుకొనే చర్యలూ అదే స్థాయిలో ఉండాల్సింది. భారత రిజర్వు బ్యాంకు రూ.1,60,000కోట్ల మేరకు నిధులు విడుదల చేసింది. నగదు నిల్వ నిష్పత్తి (సి.ఆర్.ఆర్.)లో కోత విధించింది. రెపో రేట్లను 400 మౌలిక పాయింట్ల మేరకు తగ్గించింది. ప్రభుత్వ పరంగా తీసుకొన్న గణనీయమైన చర్య ఇదొక్కటే. ముఖ్యంగా గమనించవలసిన విషయమేమిటంటే- ఈ రేట్లు ఏడాది క్రితం ఎంత ఉండేవో ఇప్పుడూ ఆస్థాయికే చేరుకొన్నాయి. ఆనాడు ద్రవ్యోల్బణం పెరగనారంభించడంతో ఆర్.బి.ఐ. హడావుడిగా సి.ఆర్.ఆర్., రెపో రేట్లు పెంచింది. ఆ పెంపుదలను ఇప్పుడు తగ్గించింది. కుదేలవుతున్న ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజితం చేయడానికి ప్రభుత్వం సకల చర్యలు తీసుకోవాలని వాణిజ్య, పారిశ్రామిక వర్గాలు కోరుతున్నాయి.

## నిర్లిప్తత ఫలితం

ఇటీవలి కాలంలో ఎన్నడూ ఎరగనంతటి తీవ్రస్థాయి మాంద్యం ఏర్పడినప్పుడు యు.పి.ఎ.లోని ఆర్థిక మేధావులు పొంచి ఉన్న ముప్పును పసిగట్టలేకపోయారు. ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలు తిరోగమిస్తుంటే, భారత ఆర్థిక వ్యవస్థ వచ్చే ఏడాది కనీసం ఆరు శాతం వృద్ధి సాధిస్తుందంటూ దరకొట్టి ప్రజానీకాన్ని ప్రభుత్వం మోసం చేసింది. బడ్జెట్ల ద్వారా ఉద్దీపన చర్యలకు గల అవకాశాలు పరిమితం. వృద్ధి రేటుకు చోదక శక్తిలాంటి కార్పొరేట్ పెట్టుబడులను పునరుద్ధరించడమే ప్రస్తుతం అందుబాటులో ఉన్న ముఖ్యచర్య. వాణిజ్య, కార్పొరేట్ రంగానికి పన్ను రాయితీలతో పాటు మౌలికరంగంలో ప్రభుత్వ పెట్టుబడులను పెంపొందించాలి. వృద్ధిరేటును కొనసాగించడానికి కఠిన చర్యలు తీసుకోవడానికీ ప్రభుత్వం వెనకాడరాదు. ఆర్థిక పరిస్థితి దిగనాసిల్లుతుండటంతో- భారత పరపతి రేటింగ్‌ను తగ్గిస్తామంటూ ప్రపంచంలోని ప్రధాన బాండ్‌రేటింగ్ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ఇంతటి దురవస్థ ఏర్పడినా కొందరు కేంద్రమంత్రులు ఇదంతా తాత్కాలిక సమస్యే అంటూ సర్దిచెప్పడానికి ప్రయత్నించడం- ప్రజల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నమే. అపాయం తలుపు తట్టినా ఉపాయం గురించి ఆలోచించకుండా ఈ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను పూర్తిగా కుంగదీసింది. ఎన్నికలయ్యాక అధికారంలోకి ఎవరు వచ్చినా, దాన్ని పైకి లేవనెత్తడం పెద్ద సవాలు. చివరికి వారూ 'ఆమ్ ఆద్మీ'ని వంచిస్తారేమో!

(రచయిత భారతీయ రైతు సంఘాల సమాఖ్య
- సి.ఐ.ఎఫ్.ఎ. ప్రాజెక్టు డైరెక్టర్)